
పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో బహిరంగ సభకు జరుగుతున్న ఏర్పాట్లు

సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి

● పరిశీలించిన వనపర్తి కలెక్టర్, ఎస్పీ

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలతో పాటు బహిరంగ సభ ఏర్పాట్లను వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభ నేపథ్యంలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమానికి వచ్చే ముఖ్య అతిథులతో పాటు, సభకు వచ్చే నాయకులు, కార్యకర్తలు వాహనాల పార్కింగ్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదే విధంగా రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిదులు, అధికారులకు అవసరమైన వసతులు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై కట్టే ఫ్లెక్సీలు

(మిగతా 6లో..)

ఎల్ఆర్ఎస్ ముందుకు సాగేనా?

● మార్చి 31లోగా రిజిస్ట్రేషన్ చేసుకుంటే 25 శాతం సబ్సిడీ
● మరో అవకాశం కల్పించిన ప్రభుత్వం
● పాత దరఖాస్తులతోపాటు కొత్త రిజిస్ట్రేషన్లకూ..
● ఇప్పటికే ప్రభుత్వ భూములు, వాటర్ బాడీస్ సర్వే నెంబర్ల గుర్తింపు
● తొలి రోజు రెండు దరఖాస్తులకు రిజిస్ట్రేషన్


మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ కార్యాలయం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్(లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుల పరిష్కారాలు ఆశించిన స్థాయిలో ముందుకు కదలడం లేదు. ఇప్పటికే ప్రభుత్వం పలుమార్లు అవకాశం ఇచ్చినా దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించి, రెగ్యులరైజేషన్ చేయించుకోవడానికి ముందుకు రాక పోవడంతో ప్రభుత్వం ఇంకో అవకాశం కల్పించింది. మార్చి 31లోగా ఫీజు చెల్లించిన వారికి 25 శాతం సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించింది. 2020లో ప్లాట్లకు రూ.1000, లేఅవుట్‌లకు రూ.10,000 చెల్లించి దరఖాస్తు చేసుకున్నవారికి అప్పటి మార్కెట్ విలువ ప్రకారం 25 శాతం సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించింది. దరఖాస్తు చేసుకోని కొత్త లేఅవుట్లకు కూడా రిజిస్ట్రేషన్‌లు చేయాలని నిర్ణయించింది. ఇదివరకు లేఅవుట్లలో 10 శాతం రిజిస్ట్రేషన్‌లు పూర్తయి, 90 శాతం మిగిలిన ప్లాట్లకు రిజిస్ట్రేషన్‌లు చేయాలని నిర్ణయించింది. వీటికి మాత్రం ప్రస్తుత మార్కెట్ విలువ ఆధారంగానే ఫీజు నిర్ణయించి 25 శాతం సబ్సిడీతో రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నాలాలకు సంబంధించిన సర్వే నెంబర్‌లలో ఉన్న భూములు, ప్లాట్లకు మాత్రం రిజిస్ట్రేషన్ చేయరు. అధికారులు ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని నగరపాలక సంస్థ, మునిసిపాలిటీలలో ప్రభుత్వ భూములు, వాటర్‌బాడీస్ సర్వే నెంబర్లు గుర్తించి రిజిస్ట్రేషన్ శాఖలకు అందించారు.

● శుక్రవారం నవాబ్‌పేట మండలం యన్మన్‌గండ్లకు చెందిన ఓ వ్యక్తి ఎల్ఆర్ఎస్ కింద దరకాస్తు చేసుకున్న తన 152 గజాల ప్లాట్‌కు రెగులరైజేషన్ కింద రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అక్కడ మార్కెట్ విలువ గజానికి రూ.900 ఉంది. ఈ లెక్కన రెగ్యులరైజేషన్ ఫీజు రూ.19093 కాగా, అందులో 25 శాతం సబ్సిడీ అంటే 4,773 రాయితీ ఇచ్చారు. మిగిలిన రూ.14320లో గతంలో దరఖాస్తు చేసుకున్న రూ.1000 తీసేసి రూ.13,320 ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

1.94 లక్షల దరఖాస్తుల రాక

ఉమ్మడి జిల్లాలోని అన్ని పురపాలిక కార్యాలయాలలో ఇదివరకు 1.94 లక్షల దరఖాస్తులు ఎల్ఆర్ఎస్ కింద వచ్చాయి. 800 వరకు లేఅవుట్ దరఖాస్తులున్నాయి. ప్లాట్ల కోసం పాలమూరు నగరపాలక సంస్థలోనే 31,190 వేల దరఖాస్తులు ఉన్నాయి. వనపర్తి మునిసిపాలిటీలో 28,941, జడ్చర్లలో 17,564, గద్వాలలో 14,317, అచ్చంపేటలో 11,971, కల్వకుర్తిలో 11,443, నాగర్‌కర్నూల్‌లో 16,011, మక్తల్‌లో 10,498, నారాయణపేటలో 6,973, భూత్పూర్‌లో 6,021 దరఖాస్తులు ఉన్నాయి. ఇప్పటికే అధికారులు వీటిని స్క్రూట్నీ చేశారు.

ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులన్నీ క్లియర్ చేసి ఫీజులు వసూలు చేస్తే ప్రభుత్వానికి వేల కోట్ల ఆదాయం సమకూరనుంది. అయితే ప్రజలనుంచి ఆశించిన స్థాయిలో స్పందన లభించడం లేదు. ఇదివరకే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత గతంలో దరఖాస్తు చేసుకున్న వారంతా రెగ్యులరైజ్ చేసుకోవాలని గడువు ఇవ్వగా, దరఖాస్తుదారులెవరూ ముందుకు రాలేదు. అధికారులు వెంటపడుతున్నా కదలిక రావడం లేదు. దీంతో 25 శాతం సబ్సిడీతో మరో అవకాశం ఇచ్చింది. మునిసిపాలిటీలతోపాటు నేరుగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లి అక్కడ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది.

ప్రచారం నిర్వహిస్తున్న యంత్రాంగం

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ఇప్పటికే అధికార యంత్రాంగం ఆయా మునిసిపాలిటీల పరిధిలో దరఖాస్తు చేసుకున్న వారి వెంట పడుతూ, ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతోంది. 25 శాతం రాయితీతోపాటు కొత్తగా లేఅవుట్‌లలో రిజిస్ట్రేషన్ కాకుండా మిగిలిపోయిన ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందని చెబుతోంది. మునిసిపాలిటీ అధికారులతోపాటు రిజిస్ట్రేషన్ అధికారులు ప్రచారం కల్పిస్తున్నారు. 25 శాతం రాయితీలపై మునిసిపాలిటీలలో ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారులంతా ముందుకు వచ్చి రెగ్యూలరైజేషన్ చేసుకుంటే ఉమ్మడి పాలమూరులోనే రూ.వందల కోట్ల ఆదాయం సమకూరనుంది.

తొలిరోజు అమవాస్య కావడంతో ..

శుక్రవారం నుంచే రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో ఎల్ఆర్ఎస్‌లకు రిజిస్ట్రేషన్‌లు ప్రారంభం అయ్యాయి. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో శుక్రవారం ఒక్కో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుకు రిజిస్ట్రేషన్ చేశారు. తొలిరోజు అమవాస్య కావడంతో ఒక్కో దరఖాస్తు మాత్రమే రిజిస్ట్రేషన్ కాగా, శనివారం నుంచి పెరగవచ్చని అధికారులు ఆశాభావంతో ఉన్నారు. మార్కెట్ విలువ ప్రకారం మొత్తం విలువలో 14 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థలో లక్ష్మీనగర్, పద్మావతి కాలనీలలో మార్కెట్ విలువ గజానికి రూ.10 వేలు ఉంది. అక్కడ 100 గజాల ప్లాట్ మార్కెట్ విలువ రూ.10 లక్షలు కాగా, అందులో 14 శాతం అంటే రూ.1.40 లక్షల రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో 25 శాతం రాయితీ ఇవ్వనున్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న విజయేందిర బోయి

అవగాహన కల్పించండి: కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్: ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నవారు మార్చి 31 లోగా క్రమబద్ధీకరణ చేసుకుంటే 25 శాతం రాయితీని పొందవచ్చని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. శుక్రవారం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి సచివాలయం నుంచి కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ నగర, మునిసిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారితో ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులపై సమీక్షించారు. రాయితీపై అవగాహన కల్పించాలని చెప్పారు.

శిశువుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా

● శిశు గృహను పరిశీలించిన జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్


శిశువుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న సూపరింటెండెంట్

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ పట్టణంలోని శిశు గృహను జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన శిశువుల ఆరోగ్య పరిస్థితిని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఇకపై ప్రతీ రోజు శిశువుల ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లతో చెకప్ చేయిస్తామని అన్నారు. ప్రస్తుతం శిశుగృహలో 30 మంది వరకు పిల్లలు ఉన్నారని, అందులో కొంతమందికి స్పీచ్ థెరపి, ఫిజియోథెరపీ సేవలు అవసరం ఉన్నాయని చెప్పారు. ఇందు కోసం డాక్టర్లను పంపించి పర్యవేక్షణ చేయిస్తామన్నారు. డా.విజయ్ శేఖర్, డీఈఐసి దేవిదాస్, శిశుగృహ ఇన్‌చార్జి గణేష్ పాల్గొన్నారు.

రూ.73 కోట్ల అంచనా

● జడ్చర్ల మునిసిపాలిటీ వార్షిక బడ్జెట్ ఇది..



జడ్చర్ల మునిసిపాలిటీలో వార్షిక బడ్జెట్‌ను వివరిస్తున్న అధికారులు

జడ్చర్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ 2025-26వ వార్షిక బడ్జెట్‌ను రూ.73 కోట్లా 50 లక్షలుగా అంచనా వేశారు. బడ్జెట్ సమావేశాన్ని శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ కోనేటిపుష్పలత అధ్యక్షతన నిర్వహించారు. అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిపాదించిన బడ్జెట్ వివరాలను అధికారులు వెల్లడించారు. బడ్జెట్ రూ.73 కోట్లా 50 లక్షలుగా అంచనా వేయగా, ఖర్చు రూ.73 కోట్లా 61 లక్షలుగా రూపొందించినట్లు వివరించారు. ఆదాయం అంశంలో జనరల్ ఫండ్ రూ.25 కోట్లా 19 లక్షలుగా, ఈఎండీ డిపాజిట్‌లు రూ.కోటి, రాష్ట్రం, కేంద్రం నుంచి మంజూరు అయ్యే వివిధ గ్రాంట్‌లు రూ.47 కోట్లా 31 లక్షలుగా వివరించారు. ఖర్చుకు సంబంధించిన అంశంలో ఔట్‌సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్న ఉద్యోగులకు రూ.ఆరు కోట్లు, సానిటేషన్ విభాగంలో డీజిల్, రిపేర్‌లు, ఫాగింగ్ తదితర వాటికి రూ.2 కోట్లా 56 లక్షలు, విద్యుత్ బిల్లు రూ.కోటీ 62 లక్షలు, హరితహారానికి రూ.2 కోట్లా 51 లక్షలు వెచ్చించనున్నట్లు తెలిపారు. తరువాత ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహణ, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు రూ.11 కోట్లా ఆరు లక్షలు, ఈఎండీల చెల్లింపునకు రూ.కోటి, వివిధ గ్రాంట్‌ల ద్వారా వచ్చిన నిధులతో రూ.47 కోట్లా 31 లక్షలు వెచ్చించనున్నట్లుగా వివరించారు. కాగా గత వార్షిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంచనాలో వచ్చిన గ్రాంట్లు, వెచ్చించిన గ్రాంట్ల అంశాలపై కౌన్సిలర్‌లు ప్రశ్నించారు.

గాంధీ ట్రస్ట్ భూములలో ఇళ్ల నిర్మాణాలకు ఎలా అనుమతులిస్తారు?

మునిసిపాలిటీలోని గాంధీట్రస్ట్ భూములలో ఇళ్ల నిర్మాణాలకు ఎలా అనుమతులు ఇస్తారంటూ టీపీవో మేఘనను కౌన్సిలర్‌లు నందకిశోర్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు ప్రశ్నించారు. అలాగే మునిసిపాలిటీ పరిధిలో కొన్ని ప్రాంతాలలో ఎలాంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో మునిసిపాలిటీ పాలకవర్గం అభాసుపాలవుతోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ లక్ష్మారెడ్డి, వైస్‌చైర్‌పర్సన్ పాలాదిసారిక, కౌన్సిలర్‌లు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

లోపలి పేజీల్లో..



జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

● ఒకరి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు

7



ఇంటి తాళం పగులగొట్టి చోరీ

● ఊర్కొండ మండలం ముచ్చర్లపల్లిలో ఘటన

7

జనరల్ ఆసుపత్రి స్థాయి పెంపు

● 700 నుంచి 900 లకు పెరగనున్న పడకలు
● అదనంగా 220 ఫ్యాకల్టీ పోస్టులు, 50 ఎంబీబీఎస్ సీట్లు

7

స్కూల్ కాంప్లెక్స్ పనులు త్వరగా పూర్తి చేయాలి


స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

● నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ పనులను త్వరిత గతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని లింగంపల్లి శివారు సర్వే నెంబర్ 30లో గల 20 ఎకరాల్లో నిర్మించ తలపెట్టిన పాఠశాల స్థలాన్ని ఆమె పరిశీలించారు. ఈనెల 21న సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయడం జరిగిందని, వాటికి సంబంధించిన పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సుమారు రూ.200 కోట్లతో నిర్మిస్తున్న భవన నిర్మాణానికి సబంధించిన ఏర్పాట్లు త్వరిత గతిన మొదలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో డీప్యూటీ ఈఈ రాము, తహసీల్దార్‌లు ఉన్నారు.

అంకితభావంతో ఏఆర్ పోలీసుల విధులు

● వచ్చే ఏడాది నెల రోజుల పాటు మొబిలైజేషన్ కార్యక్రమం
● ఎస్పీ జానకి


మాట్లాడుతున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల నిర్వహణలో పోలీసుల సేవలు మరువలేనివని, ఏఆర్ పోలీసులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్నారని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి అన్నారు. ఏ సమయంలోనైనా, ఎలాంటి పరిస్థితిల్లోనైనా విధులు నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉంటారని వారి సేవలను కొనియాడారు. శుక్రవారం జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్) పోలీసుల మొబిలైజేషన్ కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి ఎస్పీ హాజరయ్యారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ రాత్రీ పగలు అన్న తేడా లేకుండా విధులు నిర్వర్తిస్తుంటారని వారి సేవలను కొనియాడారు. పోలీసు డ్యూటీలో చేరిన తరువాత బ్యాచ్‌మేట్‌లు కూడా కలుసుకునే పరిస్థితి ఉండదన్నారు. ఇలాంటి మొబిలైజేషన్ కార్యక్రమాలు అందరూ మరోసారి కలుసుకోవడానికి దోహదపడతాయన్నారు. రెండు వారాలపాటు నిర్వహించిన మొబిలైజేషన్‌ను అందరూ చక్కగా వినియోగించుకున్నారని, ఇందులో ఫైరింగ్ చేసే అవకాశం కూడా లభించిందన్నారు. వచ్చే ఏడాది నెలరోజుల పాటు మొబిలైజేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. విధినిర్వహణలో పోలీసులు ఎప్పుడూ బిజీగా ఉంటారని, చాలాసార్లు కుటుంబాలతో కూడా గడిపే పరిస్థితి ఉండదన్నారు. అందుకే ఇలాంటి మొబిలైజేషన్ కార్యక్రమాలు అందరూ కలుసుకుని చుట్టూ జరిగే పరిస్థితులను చర్చించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తమలోని లోపాలను సరిచేసుకుంటూ విధి నిర్వహణలో మరింత పరిణతి చెందడానికి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు కృష్ణయ్య, నగేశ్, రవి పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ బెన్‌షాలం


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలం

నారాయణపేట ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా వ్యాప్తంగా 16 పరీక్షా కేంద్రాల్లో ఈనెల 5 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బెన్‌షాలం, ఇంటర్ నోడల్ అధికారి సుదర్శన్‌లు అన్నారు. శుక్రవారం నారాయణపేట జూనియర్ కాలేజీలో ఇంటర్ వార్షిక పరీక్షలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్‌మెంట్ అధికారుల సమావేశాన్ని ఉద్ధేశించి వారు మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 16 పరీక్షా కేంద్రాల్లో జనరల్ విద్యార్థులు 7,684 మంది, ఒకేషనల్ 1,107 మందితో మొత్తం 8,791 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఒకటి, సిట్టింగ్ స్క్వాడ్ బృందం ఒకటి, కస్టోడియన్స్ ముగ్గురు, అడిషనల్ సూపర్‌వైజర్స్ నలుగురు, డిపార్ట్‌మెంట్ అధికారులు 16, చీఫ్ సూపరింటెండెంట్స్ 16, ఇన్విజిలేటర్లు 450 మందిని నియమించామన్నారు.

హక్కులపై అవగాహన ఉండాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మీపతిగౌడ్

నారాయణపేటటౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలోని హక్కులపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.సురేష్‌కుమార్ అన్నారు. జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ కార్యదర్శి వింద్యానాయక్, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆదేశాల మేరకు శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని మార్కెట్ లైన్, గవర్నమెంట్ హైస్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతిగౌడ్ మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. పిల్లల రక్షణ కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఉచిత న్యాయ సహాయం కోసం 15100కు ఫోన్ చేయాలన్నారు. వరకట్న వేధింపులు, సఖి సెంటర్, ఓల్డేజ్ హోమ్, గవర్నమెంట్ నుంచి వచ్చే బెనిఫిట్స్, ప్రయోజనాలపై అవగాహన, ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలి అనే విషయాలను వివరించారు. చట్టాన్ని మరింత బలోపేతం చేయడానికి రెండు కొత్త సెక్షన్లు వచ్చాయని, సెక్షన్ 498 ఎ.సెక్షన్ 304బి భారతీయ శిక్షాస్మృతిలోకి ప్రవేశపెట్టబడ్డాయన్నారు. సదస్సులోని అన్ని విషయాలను తల్లిదండ్రులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయంత్, ఉపాధ్యాయులు, పారా లీగల్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫోన్‌కాల్ వచ్చిన వెంటనే స్పందించాలి

● 1962 అంబులెన్స్ ప్రాజెక్టు ప్రతినిధి బగీష్ మిశ్రా



అంబులెన్సులో రికార్డులను పరిశీలిస్తున్న బగీష్ మిశ్రా

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం)/జడ్చర్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడి నుంచైనా 1962 అంబులెన్సులకు కాల్ వచ్చిన వెంటనే స్పందించి తక్షణ వైద్యసేవలు అందించాలని జీవీకేఈఎంఆర్ఐ రాష్ట్ర 1962 అంబులెన్సు ప్రాజెక్టు ప్రతినిధి డా. బగీష్ మిశ్రా అన్నారు. శుక్రవారం ఆయన మహబూబ్‌నగర్, జడ్చర్లలోని 1962 అంబులెన్సుల పనితీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అంబులెన్స్‌లలో అన్ని వైద్యపరికరాలు, మందులు ఉండేలా చూసుకోవాలని, దీంతో పాటు వాహనం కండీషన్ చెక్ చేసుకుంటూ ఉండాలన్నారు. వాహనాలలో ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక కోఆర్డినేటర్లకు తెలియజేయాలని సూచించారు. జిల్లాలో ప్రతీ అంబులెన్సు పది ట్రిప్పులు, అదేవిధంగా 20 పైగా జంతువులకి సేవలందించాలని, నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ రవి, ఎగ్జిక్యూటివ్ ఉదయ్ కుమార్, మానస, జానకిరామ్, సంధ్య పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయమే మేలు

● వ్యవసాయ శాఖ అధికారి ప్రత్యూష

జడ్చర్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : దుష్ప్రభావాలను అరికట్టేందుకు సేంద్రియ వ్యవసాయమే మేలని భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయశాఖ అధికారి ప్రత్యూష తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష, జంతు శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం సుస్థిర భవిష్యత్తుకై వ్యవసాయ రంగంలో మొక్కలు, జంతువుల పాత్ర అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడారు. ద్రవ, ఘనజీవామృతం తయారీ, వానపాముల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుకన్య, సహాయ ఆచార్యులు డాక్టర్ సదాశివయ్య, ఇష్రత్ సుల్తానా, లత, రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శివరాత్రి బ్రహ్మోత్సవాలు

● దత్త పీఠంలో అన్నదానం

మక్తల్ రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలం వల్లభాపురం శ్రీదత్త పీఠంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం కొనసాగాయి. ఆలయ పూజారి రఘు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆదివారం రేణుక మాతకు బోనాల సమర్పణ ఉంటుందని, భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీదత్త పీఠం ట్రస్టు కమిటీ, దేవాలయ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో మాతా నిరంజన్, ఆనంద, సరస్వతి, మాజీ ఎంపీపీ వనజ, పసుపుల మాజీ సర్పంచు దత్తు, రామలింగారెడ్డి, చిట్యాల లక్ష్మణ్, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



జల్డి బిందెను తీసుకువస్తున్న పూజారి, పాల్గొన్న గ్రామస్థులు

ఘనంగా మారెమ్మ అవ్వ జల్ది బిందె

మాగనూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి అమావాస్యను పురస్కరించుకొని మాగనూరు మండల కేంద్రంలోని మారెమ్మ దేవతకు కృష్ణా, బీమా సంఘమ క్షేత్రాల నుంచి శుక్రవారం జల్ది బిందెతో నీటిని భజన మేళతాళాల మధ్య దేవాలయానికి తీసుకువచ్చారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌కు సంఘమ క్షేత్రాల నుంచి తీసుకొచ్చిన జలంతో అభిషేకం, పంచామృతాభిషేకం, సంప్రోక్షణ, మహా మంగళహారతి, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే తండాల అభివృద్ధి

● ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



సూక్య తండాలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజన తండాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పోతులమడుగు పంచాయతీ పరిధిలోని సూక్య తండాలో సీసీరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పోతులమడుగు హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలన్న లక్ష్యంతో దేవరకద్ర నియోజవర్గం లోని 52జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల రూ.20లక్షల వ్యయంతో డిజిటల్ మెటీరియల్ అందిస్తున్నట్లు వివరించారు. మండలంలోని చౌలతండాకు రూ.2.20కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు వేయడానికి ఎమ్మెల్యే భూమి పూజ, శంకుస్థాపన చేశారు. అదేవిధం గా లోక్యి తండా, పెద్దతండాలకు, సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా వెల్కిచర్లలో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి నవీన్‌గౌడ్, కదిరె శేఖర్‌రెడ్డి, హర్యానాయక్, కొండన్న, సంజీవరెడ్డి, ఆనంద్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రాంరెడ్డి, ఎంఈవో ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

దేవరకద్ర: మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటయపల్లిలో స్కూల్, సీసీరోడ్డు, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఎమ్మెల్యేను రైతులు కలిసి ప్రాజెక్టు కింద సాగు చేసుకున్న వరి పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయని విన్నవించారు. నీటిని విడుదల చేయాలని కోరగా ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి నీటిని అందిచేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అంజిల్‌రెడ్డి, నరసింహరెడ్డి, ఫారుక్‌అలీ, భారతమ్మ, రామకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పదిలో ఉత్తమ ఫలితాల కోసం తలుపులు తట్టండి'



సింగారంలో పదో తరగతి విద్యార్థి తల్లికి అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కృష్ణ/నారాయణపేట రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ఉత్తమ ఫలితాల కోసం విద్యార్థుల ఇళ్ల తలుపులను తట్టాలని జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సంతోషి అన్నారు. మండల పరిధిలోని కుస్నీ గ్రామంలో శుక్రవారం ఉపాధ్యాయులతో కలిసి హెచ్‌ఎం 'పది' విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఉత్తమ ఫలితాలు పొందడానికి తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఉదయం 5 గంటలకు విద్యార్థులను నిద్రలేపి చదివించాలన్నారు. విద్యార్థులకు వ్యవసాయ పనులు, ఇతర పనులు పరీక్షలు అయ్యేదాకా చెప్పొద్దని సూచించారు. ప్రతీరోజు వారిని పాఠశాలకు పంపించాలని కోరారు. ఉపాధ్యాయులు నర్సింహులు, నరేందర్, ఖాసీంఅలీ, నగేష్ తదితరులున్నారు.

● విద్యార్థుల తలుపు తట్టండి కార్యక్రమంలో భాగంగా పేట మండలం శేర్నపల్లి, సింగారం, జాజాపూర్‌లో ఉపాధ్యాయులు శుక్రవారం 'పది' విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షలు ఎలా రాయాలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో టీవీ, మొబైల్‌లకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, భానుప్రకాశ్, లక్ష్మణ్ తదితరులున్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● రాష్ట్ర ఇంటర్ బోర్డు అసిస్టెంట్ కమిషనర్ విశ్వేశ్వర్

గద్వాల సర్కిల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఇంటర్ బోర్డు అసిస్టెంట్ కమిషనర్ విశ్వేశ్వర్ ఆదేశించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ నేపథ్యంలో శుక్రవారం గద్వాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీఐఈవో, ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ హృదయరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా పకడ్బందీగా పరీక్షలు కొనసాగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అన్ని పరీక్షా కేంద్రాల్లో అవసరమైన ప్రదేశాల్లో నాణ్యతగల కెమెరాలను ఇంటర్ బోర్డుకు అనుసంధానం అయ్యేలా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పరీక్షలకు సంబంధించి ప్రతీ సంఘటనను సీసీ కెమెరా నిఘాతో రాష్ట్ర ఇంటర్ బోర్డు గమనిస్తోందని తెలిపారు. విద్యార్థులకు తాగునీటి, టాయిలెట్స్, మెడిసిన్స్ తదితర వసతులు కల్పించాలని చెప్పారు. పరీక్ష రాసే ప్రతీ తరగతి గదిలో విద్యుత్తుతో పాటు ఫ్యాన్, వెంటిలేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చూపొద్దని హితవు పలికారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించే జిల్లా కలెక్టర్‌తో పాటు పరీక్షల కన్వీనర్‌కు బోర్డు ఆదేశాల మేరకు సెల్‌ఫోన్ అనుమతి లేదని వివరించారు. అత్యవసర సమయంలో పోలీసు సహకారంతో వైర్‌లెస్ ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల హాల్ టికెట్లను నిశితంగా పరిశీలించి పరీక్షా కేంద్రాల్లోనికి పంపాలని చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో ఇంటర్ పరీక్షల నిర్వహణ అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలని చెప్పారు. డీఐఈవో, కన్వీనర్ హృదయరాజు మాట్లాడుతూ లోటుపాట్లు లేకుండా సీఎస్, డీఎస్, ఇన్విజిలేటర్లు పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు ప్రశ్నపత్రాల పంపిణీ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. నిర్ణీత సమయం కంటే ముందే పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని సూచించారు. డీఈసీ సభ్యులు వీరన్న, క్రిష్ణ, దేవేందర్ రెడ్డి, పద్మావతి, ఆయా పరీక్షా కేంద్రాల సీఎస్, డీవోలు పాల్గొన్నారు.

మెలకువలతో చదివితే ఉజ్వల భవిష్యత్

బల్మూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు మంచి మెళకువలతో విద్యాభ్యాసం చేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి, ఇంటర్ విద్యార్థినుల వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వసతి గృహాల్లో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని ఆయన గుర్తు చేశారు. ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగులుగా, లాయర్లు, పోలీసులతో పాటు వివిధ ఉద్యోగాలతో జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలో జరిగే పది, ఇంటర్ పరీక్షల్లో విద్యార్థినలుఉ మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, గురువులకు, జిల్లాకు మంచి పేరు తేవాలని ఆయన సూచించారు. కస్తూర్బా పాఠశాలల జిల్లా కో ఆర్డినేటర్ శోభారాణి మాట్లాడుతూ ఆడపిల్లలు ఇంటికే పరిమితం కాకుండా మంచిగా చదివి స్థిరపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో విష్ణుమూర్తి, పాఠశాల ప్రత్యేక అధికారి లలిత, స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఖదీర్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, మాసన్న, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి కరాటేలో చారకొండ విద్యార్థి ప్రతిభ



కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునగౌడ్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న విద్యార్థి చారకొండ విఘ్నేష్

చారకొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన చోటోఖాన్ కరాటే కుంగ్ ఫూ అంతర్జాతీయ స్థాయి గ్రాండ్ చాంపియన్‌షిప్ అండర్-14 కరాటే విభాగంలో చారకొండకు చెందిన చారకొండ జంగయ్య, వెంకటమ్మల కుమారుడు విఘ్నేష్ మొదటి స్థానంలో ప్రతిభ కనబరిచాడు. దీంతో కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునగౌడ్ చేతుల మీదుగా విగ్నేష్ మొదటి బహుమతి అందుకున్నాడు. ఈ విద్యార్థి హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్‌లోని ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ప్రతిభ కనబరచడంతో తల్లిదండ్రులు, కరాటే మాస్టర్, ఉపాధ్యాయులు విఘ్నేష్‌ను అభినందించారు.

బురిడీ.. రాబడి!

● బంగారం దందా తీరు

● ఓపక్క దొంగ బంగారం కొనుగోళ్లు.. మరోపక్క నకిలీ బంగారు ఆభరణాల తయారీ

గద్వాల క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా దొంగబంగారం కొనేందుకు అడ్డాగా మారిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. దీంతో పాటు బంగారు ఆభరణాల తయారీలో కూడా వెండిని కలుపుతుండటం గమనార్హం. గద్వాల జిల్లా కేంద్రంలోని కొందరు బంగారు దుకాణాల యజమానాలు దొంగలతో ఆభరణాలు కొని కోట్లు గడించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బయట అయితే తులం బంగారం కొనాలంటే రూ. 80 వేలకు పైగానే ఉంటుంది. అయితే, దొంగతనాలు చేసి కొట్టుకొచ్చిన బంగారాన్ని ఇక్కడ కొందరు దుకాణ యజమానులు కేవలం రూ. రూ.10 వేల నుంచి రూ.20 వేలకే కొనుగోలు చేస్తూ రూ.కోట్లలో గడిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇందుకై కొందరు పోలీసులు, రాజకీయ నాయకుల అండదండలే ప్రధాన కారణంగా చెప్పవచ్చు.

● కర్నూల్, రాయచూర్ జిల్లాల్లో కేసులు

దొంగిలించిన దొంగలు బంగారు ఆభరణాలను గద్వాల జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ ప్రాంతంలో పలువురికి అమ్మినట్లు గతంలో ఆరోపణలు కూడా ఉన్నాయి. అంతేకాక కొందరు రాయచూర్, కర్నూల్ జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లో గద్వాలకు చెందిన స్వర్ణకారుల పేర్లు ఉన్నట్లు తెలుస్తున్నది. గతంలో కర్నూల్ 4వ టౌన్‌లో దొంగతనం చేసిన ఓ దొంగ గద్వాల పట్టణంలోని గాంధీచౌక్ సమీపంలో గల ఓ బంగారు దుకాణంలో పదమూడున్నర తులాల బంగారు ఆభరణాలు అమ్మాడు. ఈ విషయమై కర్నూల్‌కు చెందిన ఎస్‌ఐ రామయ్య ఇక్కడికి వచ్చి సదరు బంగారు దుకాణ వ్యక్తిని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించారు. దీంతో కొందరు వ్యాపారస్థులు, ఓ రాజకీయ నాయకుడు అండగా ఉండి రికవరీ చేయించిన విషయం విదితమే. అలాగే గతంలో కూడా రాయచూర్‌కు చెందిన పోలీసులు గద్వాల పట్టణంలోని గాంధీచౌక్ సమీపంలో ఉన్న పలువురు స్వర్ణకారులను అరెస్ట్ చేసి రికవరీ చేసిన విషయం తెలిసిందే. ఇంత తెలిసినా కొందరు నాయకులు, అధికారులు వారికి ఎందుకు వత్తాసు పలుకుతున్నారో అర్థం కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● బంగారు ఆభరణాల తయారీలో వెండి వాడకం..

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ సమీపంలో ఉన్న కొందరు స్వర్ణకారులు బంగారు ఆభరణాల తయారీలో వెండిని వాడుతూ ప్రజలను మోసం చేస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవలే గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళ గత కొన్ని రోజుల క్రితం చేయించుకున్న బంగారు ఉంగరాన్ని అమ్మింది. దాని స్థానంలో అదనంగా ఇంకా కొద్ది బంగారం వేయించి ఉంగరం చేయించేందుకు తలంచింది. పాత ఉంగరంలో బంగారంతో పాటు వెండిని కూడా కలిపి తయారు చేసినట్లు తెలుపడంతో అవాక్కైన ఆ మహిళ ఏమి చెప్పాలో తెలియక వెనుతిరిగి వెళ్లిన సంఘటన ఇటీవలే చోటు చేసుకుంది. ఇలా బంగారు ఆభరణాల తయారీలు వెండిని కలుపుతూ ప్రజలను మోసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

● హాల్‌మార్క్ పేరుతో దోపిడీలు...

జిల్లాలో చిన్న, పెద్ద బంగారు దుకాణాలు 150కి పైగా ఉన్నాయి. ఇందులో దాదాపు హాల్‌మార్క్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నవి కేవలం వేళ్లమీద లెక్కించవచ్చు. జిల్లా కేంద్రంలో కేవలం ఒకటి, లేదా రెండు మాత్రమే. అలాగే జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో మరో ఒకటి ఉండవచ్చని తెలుస్తుంది. కానీ బంగారు కొనుగోలు చేసుందుకు వస్తున్న ప్రజలను తమ దగ్గర హాల్‌మార్క్ ఉన్నదని, ఎక్కడైనా చూపినా స్వచ్ఛమైన బంగారం రుజువైతుందని నమ్మబలుకుతూ ప్రజలను మోసం చేస్తూ బంగారం విక్రయిస్తున్నారు. అలాగే వీరు ప్రభుత్వానికి జీఎస్టీ చెల్లించకపోవడం లేదనే తెలుస్తుంది. బంగారం కొనుగోలు చేసేందుకు వస్తున్న ప్రజల నుంచి జీఎస్టీ డబ్బులను వసూలు చేస్తూ ప్రభుత్వానికి కట్టకుండా దుకాణాదారులు బురిడీ కొట్టిస్తున్నారు. అయితే మామూళ్లకు ఆశపడిని అధికారులు కనీసం ఇటువైపు కూడా రాకుండా ఉండటంతో వీరి ఆగడాలకు అడ్డూ, అదుపూ లేకుండా పోయిందనే వార్తలు వినిపిస్తున్నాయి.

ముఖ్యమంత్రి పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా కట్టుకోవాలని సూచనలు చేస్తున్నారు. అదే విధంగా పాలిటెక్నిక్ కళాశాల వెనుక భాగంలో హెలిప్యాడ్ పనులను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రతీ అధికారి బాధ్యతగా తీసుకుని పని చేయాలని అధికారులకు సూచిస్తున్నారు.

● వెలసిన ఫ్లెక్సీలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారి వనపర్తికి వస్తుండటంతో పార్టీ నాయకులతో పాటు రేవంత్ రెడ్డి మిత్రులు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పాలిటెక్నిక్ కళాశాల మైదానంతో పాటు రాజీవ్‌చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తాలో ఫ్లెక్సీలతో ఆ ప్రాంతమంతా నిండిపోయింది. పెద్ద పెద్ద హోర్డింగ్‌లతో పాటు భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు.



పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో బహిరంగ సభకు జనం కూర్చునేందుకు జరుగుతున్న ఏర్పాట్లు

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

- జాతీయ స్థాయి మహిళా కబడ్డీ విజేత హర్యానా



కబడ్డీ పోటీ రెండవ విజేత బహుమతి అందుకుంటున్న తమిళనాడు జట్టు మహిళా క్రీడాకారులు

అయిజ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): హోరాహోరీగా జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలు జరిగాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన కబడ్డీ క్రీడాకారులు తమ గెలుపు కోసం ప్రత్యర్థి జట్టుతో తలపడ్డారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని పులికల్ గ్రామంలో మహాశివరాత్రి పర్వదినాన పురస్కరించుకుని గట్టుమీద రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం జాతీయ స్థాయిలో మహిళా కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. జాతీయ స్థాయిలో మహిళా కబడ్డీ పోటీల్లో పాల్గొనటానికై హర్యానా, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి మొత్తం 12 జట్లు పాల్గొన్నాయి. గెలుపు కోసం హోరా హోరీగా తలపడ్డారు. ఈ పోటీలు రాత్రి 11-30 నిమిషాల వరకు కొనసాగాయి. రాత్రి 10-30 నిమిషాలకు ఫైనల్ మ్యాచ్ హర్యానా, తమిళనాడు జట్ల మధ్యన ప్రారంభం అయ్యి ఆఖరి వరకు ఉత్కంఠగా సాగింది. ఇందులో తమిళనాడు జట్టు 18 పాయింట్లు, హర్యానా జట్టు 24 పాయింట్లు సాధించటం జరిగింది. దీనితో హర్యానా మహిళా జట్టు మొదటి స్థానాన్ని దక్కించుకుంది. తమిళనాడు జట్టు రెండో స్థానాన్ని, తమిళనాడు జీఎల్ఎస్ మూడో స్థానాన్ని, బెంగళూర్ ఏ నాలుగవ స్థానాన్ని, బెంగళూర్ బీ రెండో స్థానాన్ని దక్కించుకున్నది. పీఈటీలు జగదీష్, దస్తగిరి, సుధీర్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం వంటకాలు వడ్డించాలి

- డీటీడీవో ఫిరంగి

బల్మూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం వంటకాలు వడ్డించాలని డీటీడీవో ఫిరంగి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కొండనాగుల గ్రామంలో గల గిరి జన వసతి గృహాన్ని తనిఖీ చేశారు. శివరాత్రి పర్వదినం రోజు శివాలయంలో పూజ కోసం వెళ్లిన విద్యార్థులు అక్కడ అన్నదానం చేయగా భోజనం చేసి వచ్చారని, మరికొందరు ఆ రోజు సాయంత్రం గంగమ్మగుడి ఆలయంలో పూజ చేశాక అన్నదానం జరిగితే అక్కడా తిని వచ్చారని తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థుల కోసం ఆ రోజు వంటలు వండారని, ఆయా గుళ్లకు పూజకు వెళ్లిన విద్యార్థులు మాత్రమే అక్కడ భోజనం చేసి వచ్చారని ఫిరంగి వివరించారు. విచారణలో ఏటీడీవో, ఏపీవో యాదమ్మ, వసతి గృహం వార్డెన్ రాములు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

» కుటుంబ కలహాలతో ఒకరు, అప్పుల బాధతో మరొకరు

కడుపునొప్పి భరించలేక ఇంకొకరు..

గోపాల్‌పేట్/ జడ్చర్ల/ ఉప్పునుంతల ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన కొంకలి మల్లయ్య (40) కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటూ కూలీ పని చేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఇటీవల కుటుంబంతో కలిసి గ్రామానికి వచ్చేశారు. ఈ క్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో జీవితం విరక్తి చెందాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన తమ్ముడు కొంకలి శివ గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య కొంకలి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ దామోదర్‌రెడ్డి తెలిపారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీలోని ఎర్రగుట్ట ప్రాంతానికి చెందిన వడ్డె సంజీవ(30), వడ్డె శ్రీలత దంపతులకు ముగ్గురు సంతానం ఉన్నారు. శ్రీలత గురువారం ఉదయం ముగ్గురు పిల్లలతో కలిసి తల్లిగారింటికి వెళ్లింది. సాయంత్రం తిరిగి వచ్చే సరికి సంజీవ ఇంట్లోని ఫ్యాన్ కొండీకి తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన భర్త ఇటీవల కొంత మంది వద్ద అప్పులు చేశాడని, అవి తీర్చలేనన్న ఆవేదనతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని ఆమె తెలిపింది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా, పెనిమిళ్ల గ్రామానికి చెందిన మేర కృష్ణయ్య (48) 20 సంవత్సరాల క్రితం భార్యా పిల్లలను వదిలేశాడు. అప్పటి నుంచి ఉప్పునుంతల మండల పరిధిలోని తాడూరు గ్రామంలో తన సోదరి సాకేవల చంద్రకళ వద్ద ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన ఆయన శుక్రవారం గ్రామ సమీపంలోని బొడ్డుపల్లి చంద్రయ్య పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణయ్య కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని సోదరి తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మిర్చి పంటకు నిప్పు

» కాలిబూడిదైన 40 క్వింటాళ్లు



మంటల్లో కాలిపోతున్న మిర్చి

అయిజ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మిర్చి పంటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండల పరిధిలోని తూముకుంట గ్రామానికి చెందిన రైతు పింజరి అల్లిపీర తన 3 ఎకరాల పొలంలో మిర్చి పంట సాగు చేశాడు. దాదాపు 40 క్వింటాళ్ల మిర్చి దిగుబడి వచ్చింది. శుక్రవారం ఉదయం మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించేందుకు గురువారం రాత్రి మిర్చి గ్రేడింగ్ చేసి రాశి పోసి సిద్ధం చేసుకున్నాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో భోజనం కోసం పొలం నుంచి ఇంటికి వచ్చాడు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మిర్చిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో గ్రామస్థులు గమనించి అక్కడికి చేరుకొని రైతుకు సమాచారం అందించారు. మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మిర్చి మొత్తం కాలి బూడిదై దాదాపు రూ. 4 లక్షల వరకు నష్టం సంభవించినట్లు రైతు పింజరి అల్లిపీర తెలిపారు. ఘటనపై శుక్రవారం అయిజ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ తీగలకు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధం



ట్రాక్టర్‌పై నుంచి కిందకు తోసేసిన గడ్డి

కొత్తకోట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : గడ్డిలోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ విద్యుత్ తీగలకు తగిలి దగ్ధమైంది. వనపర్తి జిల్లా, కొత్తకోట మండలంలోని పామాపురం గ్రామంలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. ఆత్మకూర్ మండలంలోని కత్తెపల్లి గ్రామానికి చెందిన రైతు రామకృష్ణ పది ఎకరాల వరి గడ్డిని ట్రాక్టర్‌లో లోడ్ చేసుకొని గద్వాలకు బయలుదేరాడు. పామాపురం మీదుగా వస్తుండగా గడ్డికి విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి కేకలు వేయడంతో రామకృష్ణ ట్రాక్టర్‌ను పక్కకు నిలిపాడు. స్థానిక యువకులు ట్రాక్టర్ మీద నుంచి గడ్డిని కర్రలతో కిందకు తోసేశారు. ఆ లోపు అగ్నిమాపక వాహన సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

జడ్చర్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి(35) మృతదేహం లభ్యమైంది. మార్కెట్‌లోని మెట్లపై ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడంటూ సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు జడ్చర్ల ఎస్ఐ జయ ప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రి మృతి చెంది ఉండొచ్చన్నారు. మృత దేహన్ని జడ్చర్ల ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.

ఫిల్టర్ ఇసుక స్థావరాలపై దాడులు



దాడుల్లో పాల్గొన్న పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు

రాజాపూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఫిల్టర్ ఇసుక తయారీ స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా, రాజాపూర్ మండల పరిధిలోని దుందుభివాగులో ఫిల్టర్ ఇసుక తయారీ స్థావరాలపై పోలీసు రెవెన్యూ, మైనింగ్ అధికారులు గ్రామీణ సీఐ నాగార్జున గౌడ్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఇసుక తయారీకి వినియోగిస్తున్న భారీ మోటర్లు, పైపులు, జనరేటర్లు, ఆయిల్ ఇంజన్లను స్వాధీనం చేసుకున్నారు. నీటి నిల్వ కోసం ఏర్పాటు చేసిన సంపులను ఎక్స్‌కవేటర్ సాయంతో పూడ్చివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృత్రిమ ఇసుక తయారీ, రవాణాను కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడులలో తహసీల్దార్ విద్యాసాగర్ రెడ్డి, ఎస్ఐలు శివానందం, లెనిన్, విద్యుత్ శాఖ అధికారులు హుసేన్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

హరహర.. పరమేశ్వరా!



ఆత్మకూరు పట్టణంలో చెరువు అంచున ఉన్న చర్ల పరమేశ్వర స్వామి ఆలయం, (ఇన్‌సెట్లో) శివలింగం

» ఆత్మకూరులో కొలువుదీరిన చర్ల పరమేశ్వర స్వామి

» సంస్థానాధీశుడు రాజా తిమ్మారెడ్డి హయాంలో ఆలయ నిర్మాణం

» నేటి నుంచి 3వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు » ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి

ఆత్మకూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఆత్మకూరు పట్టణంలో స్వయంభువుగా వెలిసిన చర్ల పరమేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతీ ఏడాది శివరాత్రి ముగిసిన తరువాత స్వామి వారి బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే ఈ సంవత్సరం కూడా ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. తొలి రోజు సీతా రామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించనున్నారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పరమేశ్వర స్వామి గుడి వరకు కొనసాగనుంది. 2వ తేదీన స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించనున్నారు. మూడవ తేదీన రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఏడాది మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చొరవతో, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చెరువులో బోటింగ్ సౌకర్యం కల్పించారు.

పొలంలో వెలిసిన స్వామి

చర్ల పరమేశ్వర స్వామికి సంబంధించిన ఓ కథనం విస్తృతంగా ప్రచారంలో ఉంది. కొన్ని శతాబ్దాల క్రితం పట్టణానికి చెందిన ఓ రైతు పొలాన్ని దున్నేందుకు సిద్ధమయ్యాడు. బరువు కోసం అక్కడే ఉన్న ఓ రాయిని నాగలిపై ఉంచాడు. సాయంత్రం పని ముగిసిన తర్వాత నాగలిని అక్కడే ఉంచి ఎద్దులను తొలుకొని ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం పొలానికి వెళ్లే సరికి నాగలిపై ఉంచిన రాయి యథాస్థానంలో కనిపించింది. రెండు, మూడు రోజుల పాటు ఇలాగే కొనసాగడంతో అది మహిమగల రాయి అని భావించాడు. ఓ రోజు రాత్రి రైతు భార్యకు కలలో పరమేశ్వర స్వామి కనిపించి, పొలంలో ఉన్నది తన ప్రతిరూపమని తెలిపాడు. ఈ విషయాన్ని ఆమె భర్తకు చెప్పడంతో పొలంలోనే చిన్న గుడి ఏర్పాటు చేసుకొని స్వామికి నిత్య పూజలు చేయడం ప్రారంభించాడు. మహబూబ్‌నగర్ మండలం, గాజులపేట గ్రామానికి చెందిన కొందరు గాజుల వ్యాపారులు ఆత్మకూరు మీదుగా కర్ణాటక రాష్ట్రానికి వెళ్తున్నారు. దారిలో స్వామిని దర్శించుకొని వ్యాపారంలో లాభాలు వస్తే గుడి కట్టిస్తామని మొక్కుకున్నారు. వారికి అత్యధిక లాభాలు రావడంతో గుడి కట్టించి మొక్కు తీర్చుకున్నారు. అప్పటి నుంచి వారి వంశస్థులు ఎక్కడ ఉన్నా బ్రహ్మోత్సవాలకు హాజరై స్వామి వారికి దాసంగ నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

క్రీ.శ 1730లో ఆలయ నిర్మాణం

అమరచింత, ఆత్మకూరు సంస్థానాలను 1720 నుంచి 1730 వరకు రాజా తిమ్మారెడ్డి పరిపా లించారు. అప్పట్లో స్వామి వారికి గాజుల వ్యాపారులు చిన్న గుడిని నిర్మించారు. రాజా తిమ్మారెడ్డి 1730లో స్వామికి పెద్ద ఆలయాన్ని నిర్మించారు. స్వామి వారి పాదాలను తాకేలా గంగ ఉండాలన్న ఆలోచనతో పక్కనే పెద్ద చెరువు తవ్వించి, ఆనకట్ట నిర్మించాడు. అందుకే స్వామి వారిని చర్ల పరమేశ్వర స్వామి అని పిలుస్తారని స్థానికులు చెప్తుంటారు.


మూడు తరాలుగా సేవ



చర్ల పరమేశ్వర స్వామికి మూడు తరాలుగా సేవ చేసుకుంటున్నాం. మా తాత, తండ్రి, నేను, తర్వాత నా కుమారుడు గిరిజేశ్వర్ కూడా స్వామి వారి సేవలో ఉన్నాం. స్వామివారి కృపతో మా కుటుంబాలు ఆనందంగా జీవిస్తున్నాయి. ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నాం.

- కర బసయ్య, ఆలయ పూజారి

మరింత వైభవంగా..



పరమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఈ సంవత్సరం మరింత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఆలయం ఆవరణలో భక్తులు సేద తీరేందుకు షామియానాలు, తాగునీటి వసతి ఏర్పాటు చేశాం.

- వెంకట నరసింహారావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు

జనరల్ ఆసుపత్రి స్థాయి పెంపు

» 700 నుంచి 900 వరకు పెరగనున్న పడకలు

» అదనంగా 220 ఫ్యాకల్టీ పోస్టులు, 50 ఎంబీబీఎస్ సీట్లు



మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) ఫిబ్రవరి 28 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రికి మంచి రోజులు వచ్చాయి. ఆసుపత్రి స్థాయిని పెంచుతూ ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో ప్రస్తుతం ఉన్న 700 పడకలు, 900కు పెరగనున్నాయి. అలాగే అదనంగా 220 వరకు ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్‌తో పాటు ఇతర పోస్టులు వచ్చే అవకాశం ఉంది. మరో 50 ఎంబీబీఎస్ సీట్లు కూడా పెరగనున్నాయి.

అందుబాటులోకి మెరుగైన వైద్యం

ఆసుపత్రి స్థాయి పెంపుతో ఉమ్మడి జిల్లా ప్రజలకు నిరంతరం మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. జనరల్ ఆసుపత్రిలో ప్రస్తుతం 650 నుంచి 700 వరకు పడకలు ఉన్నాయి. ప్రతీ ఏడాది పడకల సంఖ్యను పెంచుతున్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, పిడియాట్రిక్ విభాగాలలో ఎక్కువ పడకలు ఉన్నాయి. ప్రభుత్వం ఆసుపత్రిని స్థాయిని పెంచడంతో అదనంగా 200 పడకలు రానున్నాయి. మొత్తం 900 పడకలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో మరింత మంది రోగులు అడ్మిట్ అయ్యేందుకు అవకాశం ఉంటుంది.

పెరగనున్న ఎంబీబీఎస్ సీట్లు

ప్రభుత్వం ఆసుపత్రి స్థాయిని పెంచడంతో మెడికల్ కళాశాలలో సీట్ల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న 770 పడకల అనుగుణంగా జాతీయ వైద్య మండలి కళాశాలకు 175 సీట్లను మంజూరు చేసింది. కానీ పడకల సంఖ్య ఎక్కువగా ఉండడంతో 200 ఎంబీబీఎస్ సీట్లకు దరఖాస్తు చేస్తున్నారు. తాజాగా పడకలు 900 వరకు పెరగడంతో అదనంగా మరో 50 సీట్లకు ఎన్ఎంసీకి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. దీంతో ఎంబీబీఎస్ సీట్లు పెరిగి ఎక్కువ మంది విద్యార్థులు వైద్య విద్యలో చేరేందుకు అవకాశం కలుగనున్నది.

అదనపు సిబ్బంది అవసరం

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అనంతరం మంజూరైన మొట్టమొదటి కళాశాల ఇదే కావడంతో 2015లో జీవో నంబర్లు 6, 27 ప్రకారం 190 వరకు పోస్టులు మంజూరయ్యాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని ఇతర కళాశాలలతో పోల్చితే మహబూబ్‌నగర్ కళాశాలకే తక్కువ పోస్టులు ఉన్నాయి. ఈ లెక్కన జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనిక్, పిడియాట్రిక్, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, సైకియాట్రి, డెర్మటాలజీ విభాగాలలో ప్రొఫెసర్ - 22, అసోసియేట్ - 37, అసి స్టెంట్ - 60, ట్యూటర్లు - 32, ఎస్ఆర్ - 35 పోస్టులు మంజూరు చేశారు. గత పదేళ్లలో పలుమార్లు ప్రతిపాదనలను పంపించినా ప్రభుత్వం ఒక్క పోస్టును కూడా మంజూరు చేయలేదు. ప్రస్తుతం పడకల స్థాయిని 900 వరకు పెంచడంతో అందుకు అనుగుణంగా వైద్యుల పోస్టులు కూడా మంజూరు అయ్యే అవకాశం ఉంది. దీని ప్రకారం అదనంగా 220 వరకు ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్, ఎస్ఆర్ పోస్టుల అవసరం ఉంటుంది. ఇప్పటికే ఉన్న పోస్టుల్లో కూడా చాల వరకు ఖాళీలు ఉండడంతో కాంట్రాక్టు సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. కొత్త పోస్టులు మంజూరు చేయకపోతే పేద ప్రజలకు మెరుగైన నిరంతర వైద్య సేవలు అందడం కలగానే మిగులుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

» రెండు కార్లు, ట్రావెల్స్ బస్సు ఢీ » ఒకరి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు



సంఘటనా స్థలంలో గుమిగూడిన జనం

పెబ్బేరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఓ కారును మరో కారు ఓవర్ టేక్ చేస్తూ ఒకదాని కొకటి ఢీకొని, డివైడర్ మీదుగా దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న మరో ట్రావెల్స్ బస్సును ఢీకొన్నాయి. ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. శుక్ర వారం వనపర్తి జిల్లా, పెబ్బేరు సమీపంలో జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరి గింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌కు చెందిన వారు పెళ్లికి హాజరయ్యేందుకు ట్రావెల్స్ బస్సులో తిరుపతికి బయలుదేరారు. అదే సమయంలో కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న రెండు కార్లు జాతీయ రహదారిపై బైపాస్ వద్ద ఢీకొని, డివైడర్‌ను దాటి, అటు నుంచి వస్తున్న ట్రావెల్స్ బస్సును ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న పెబ్బేరుకు చెందిన ముష్టి విష్ణు (35) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. రెండు కార్లతో పాటు, బస్సులో ప్రయాణిస్తున్న వారిలో పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకు న్నారు. తీవ్రంగా గాయపడ్డవారిని హైదరా బాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. స్వల్ప గాయాలైన వారిని అంబులెన్స్‌ల్లో పెబ్బేరు, వనపర్తి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సంఘటనతో జాతీయ రహదారిపై రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాలను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

ఊర్కొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లారు. నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలం, ముచ్చర్లపల్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. హెడ్ కానిస్టేబుల్ దండోత్కర్ వెంకోజీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముచ్చర్లపల్లి మాజీ సర్పంచ్ వీరెడ్డి పర్వత్‌రెడ్డి మూడు రోజుల క్రితం హై దరాబాద్‌లోని తన ఇంట్లో జారిపడటంతో గాయాలయ్యాయి. అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను పరామర్శించేందుకు గ్రామం నుంచి కుటుంబ స భ్యులు గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. అదే రోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లో చొరబడ్డారు. బీరువాలో ఉన్న దాదాపు రూ. 4 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును ఎత్తుకెళ్లారు. శుక్రవారం గ్రామానికి చేరుకున్న కుటుంబసభ్యులు ఇంటి తలుపులు తెరచి ఉండటం గమనించారు. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని నగలు, నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కల్వకుర్తి సీఐ నాగార్జున సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులు, స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్‌తో పాటు, కానిస్టేబుళ్లు విజయ్ కుమార్, చిరంజీవి, నజీర్ ఉన్నారు. మాజీ సర్పంచ్ సోదరి శశికళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకోజీ తెలిపారు.

భూసర్వేను అడ్డుకున్న గ్రామస్థులు

» తహసీల్దార్ హామీతో ఆందోళన విరమణ



అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు, రైతులు

ఊట్కూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : భూ సర్వే కోసం వచ్చిన అధికారులను గ్రామస్థులు, రైతులు అడ్డుకున్నారు. నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా నారాయణపేట జిల్లా, ఊట్కూర్ మండలంలోని దంతన్‌పల్లి శివారులో కాల్వలు నిర్మించనున్నారు. అందుకోసం భూమిని సర్వే చేసేందుకు శుక్రవారం ఉదయం తహసీల్దార్ రవి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, సర్వే సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకున్నారు. వారిని సర్వే చేయకుండా గ్రామస్థులు అడ్డుకున్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు అరవింద్‌కుమార్, నాయకులు ఇబాదుర్ రహెమాన్, ఆనంద్‌రెడ్డి, తరుణ్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, మాజీ ఎంపీటీసీ హన్మంతు రైతులతో కలిసి అధికారులతో వాదనకు దిగారు. రైతులతో మాట్లాడకుండా, ఎంత పరిహారం ఇస్తారో చెప్పకుండా సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించారు. తహసీల్దార్ రవి మాట్లాడుతూ భూ సర్వేను అడ్డుకోవడం సరికాదన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే చెప్పాలని, ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సర్వే చేస్తేనే ఎవరి భూమి ఎంత ఉందో తెలుస్తుందని నచ్చచెప్పారు. అధికమొత్తంలో పరిహారం వచ్చేలా చూస్తామని, బోర్లు, చెట్లు, తోటలు ఉంటే ఇంకా ఎక్కువగా ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. అనంతరం అధికారులు సర్వే కొనసాగించారు. సర్వేలో ఆర్ఐలు వెంకటేశ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠకు తెర

» 48 గంటల తర్వాత విద్యార్థి మృతదేహం లభ్యం



ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, నాయకులు

వెల్దండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు ఉత్కంఠ వీడింది. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని గుండాల అంబారామలింగేశ్వరస్వామి ఆలయ కోనేరులో గల్లంతైన ఇంటర్ విద్యార్థి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. కల్వకుర్తి మండలంలోని జేపీ నగర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న పెరుమాళ్ల ఓమేష్ బుధవారం అంబా రామలింగేశ్వరస్వామి ఆలయంలోని గుండంలో గల్లంతయ్యాడు. వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది కోనేరులోని నీటిని తోడేసి, గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది గురువారం సంఘటనా స్థలానికి చేరుకొని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. సాయంత్రం వరకు గాలించినా ఫలితం దక్కలేదు. శుక్రవారం ఉదయం మళ్లీ గాలింపు మొదలు పెట్టారు. అద్దం సహాయంతో సూర్యకాంతిని కోనేరు లోపలి భాగంలో పడేలా చేసి పరిశీలించగా మృతదేహం కనిపించింది. భారీ క్రేన్ సహాయంతో ఇద్దరు ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది లోనికి దిగి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కల్వకుర్తి నుంచి మరో పెద్ద సైజు క్రేన్ తెప్పించిన ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది దాదాపు 120 ఫీట్లు లోనికి వెళ్లి తాడు సాయంతో మృతదేహన్ని బయటకు తీసుకొచ్చారు. దాదాపు 48 గంటల పాటు ఆపరేషన్ కొనసాగింది. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఏడు గంటలకే గుండాలకు చేరుకొని గాలింపు పనులను పర్యవేక్షించారు.

కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాల ఆందోళన

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి ఓమేష్ కుటుంబసభ్యులు, ప్రజాసంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. మృతదేహం తరలింపును అడ్డుకున్నారు. బాధిత కుటుంబానికి కోటి రూపాయలు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, మూడెకరాల భమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ యాదగిరి అక్కడికి చేరుకొని బాధితులను సముదాయించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ ఇబ్రహీం ప్రకటించడంతో ఆందోళన విరమించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

యాసంగిలో వరి సాగు విస్తీర్ణం పెంచటమే లక్ష్యం

● రేష్మారెడ్డి, మండల వ్యవసాయ అధికారిణి, గుండుమాల్ మండలం



కోస్గి రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో వరి సాగు విస్తీర్ణం పెంచటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని గుండుమాల్ మండల వ్యవసాయ అధికారిణి రేష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలపై మాట్లాడారు.

మండలంలో యాసంగి వరి సాగు విస్తీర్ణం ఎంత?

క్రాప్ బుకింగ్ సర్వే నడుస్తోంది. దాదాపు 4200 ఎకరాలకు వరకు సాగు విస్తీర్ణం ఉండవచ్చు.

యాసంగి పంటకు అవసరమయ్యే నీటి వనరులు ఉన్నాయా?

ప్రస్తుతం బోరు బావుల్లో నీరు సమృద్ధిగా ఉంది. చెరువులు, కుంటల్లో కూడా యాసంగి పంటకు నీరు అందుబాటులో ఉంది.

మండలంలో ఏ ప్రాంతంలోనైనా యాసంగి పంట ఎండిపోయే ప్రమాదముందా?

దాదాపు 10 నుంచి 15 శాతం వరకు పంటలు ఎండిపోయే అవకాశముంది. రైతులకు ముందుజాగ్రత్త చర్యలు సూచిస్తున్నాం.

ఎంతమంది రైతులకు రైతు భరోసా అందింది?

మండల వ్యాప్తంగా 5118 మంది రైతులకు రూ.4 కోట్ల 38 లక్షల 44 వేలు వారి అకౌంట్లలో జమ అయ్యాయి.

రైతు భరోసా అందని రైతులు ఎంతమంది ఉన్నారు? వారికి ఎప్పుడు అందుతుంది?

టెక్నికల్ ఇబ్బందుల వల్ల 10 నుంచి 15 శాతం మంది రైతులకు రైతు భరోసా అందలేదు. మార్చి చివరి వరకు వారికి బ్యాంక్ అకౌంట్లో డబ్బులు జమ అవుతాయి.

పేట యార్డులో ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం ధాన్యం విక్రయానికి వచ్చింది. ధాన్యం ధరలు ఈ విధంగా ఉన్నాయి.

ధాన్యం	క్వింటాల్	గరిష్ట	కనిష్ట
		(రూపాయలలో)	
వేరుశనగ	72	6,240	3,610
పెసళ్లు	6.37	6,402	5,550
ఎర్ర కందులు	81.34	7,529	6,009
తెల్ల కందులు	29.89	7,759	6,700
అలసందలు	15.68	6,669	6,012
తెల్ల కుసుమలు	9	5,115	5,115

న్యూస్ బాక్స్

8న జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

● ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వివాదాలు పెంచుకోకుండా కలిసి ఉండాలని అనుకున్నప్పుడు సమసిపోతాయని, రాజీ మార్గమే రాజమార్గమని ఎస్పీ యోగేష్ గౌతమ్ శుక్రవారం పేర్కొన్నారు. మార్చి 8న న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నారాయణపేట, కోస్గి కోర్టుల లో లోక్ అదాలత్ నిర్వహించనున్నామని తెలిపారు. వివిధ రకాల కేసులలో రాజీ పడాలనుకున్న వారు లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, గొడవలు, చీటింగ్, వివాహ సంబంధం, చిన్న దొంగతనాలు, డ్రంకెన్ డ్రైవ్ తదితర కేసుల్లో రాజీ పడదలుచుకున్న కక్షిదారులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఆధార్‌కార్డుతో సంబంధిత కోర్టుకు హాజరు కావాలన్నారు.

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో రాష్ట్ర షూటింగ్ బాల్ సంఘం ఉపాధ్యక్షుడు గోపాలం

మక్తల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గత జనవరిలో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన మక్తల్ నియోజకవర్గానికి చెందిన 12మంది బాలబాలికలు జాతీయ స్థాయి షూటింగ్ బాల్ జూనియర్, సబ్ జూనియర్ పోటీలకు ఎంపికైనట్లు రాష్ట్ర షూటింగ్‌బాల్ ఉపాధ్యక్షుడు, విశ్రాంత పీఈటీ గోపాలం, జిల్లా అధ్యక్షుడు సత్య ఆంజనేయులు తెలిపారు. మార్చి 1 నుంచి 3 వరకు నల్లగొండ జిల్లాలో జరిగే జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ క్రీడల్లో పాల్గొంటారని వారు తెలిపారు. వెళ్లిన వారిలో స్వప్న, శ్రీలత, రమేష్‌కుమార్, మమత, అఖిల, గాయత్రి, నవ్యశ్రీ, అరుణ, శ్రావణి సురేష్, పరుశరాములు, గుంతలి రాములు, కావలి రఘు ఉన్నారు.

జడ్పీటీసీ మాజీ సభ్యుడు మృతి

మాగనూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. వెంకటయ్య మృతి పార్టీకి తీరని లోటని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, నాయకులు పేర్కొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులు సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. సందర్శించిన తోటి విద్యార్థులు, ఆహుతులకు ప్రయోగాల పనివిధానాన్ని వివరించారు.



పేట శిశుమందిర్‌లో సైన్స్ ప్రయోగాల గురించి వివరిస్తున్న విద్యార్థులు



ఊట్కూర్ పాఠశాలలో సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న ఉపాధ్యాయులు



మక్తల్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో సైన్స్ ప్రయోగాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నారాయణపేట/నారాయణపేట రూరల్/మక్తల్/దామరగిద్ద/కృష్ణ/కోస్గి రూరల్/ ఊట్కూర్/మక్తల్ రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట విద్యాశాఖ కార్యాలయం వద్ద సీవీ రామన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాష్ మాట్లాడుతూ భారత శాస్త్రవేత్త వైద్యుడు సీవీ రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్ట్ గౌరవార్థం ఫిబ్రవరి 28న భారతదేశ వ్యాప్తంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ద్రవాలపై పడిన కాంతి కిరణాలు ఎలా పరిక్షేపం చెందుతాయో తెలిపే పరిశోధన ఫలితాన్నే రామన్ ఎఫెక్ట్ అంటారని తెలిపారు. కార్యక్రమంలో సచ్చిదానందచారి, రాజేందర్, యాదయ్యశెట్టి, శ్రీనివాసులు, శశికుమార్, మహేష్, సురేష్, ఎంఈవో బాలాజీ, శ్రీకాంత్, రాహుల్, వెంకట్రాములు, నర్సింగ్, అబ్దుల్‌ఘని తదితరులున్నారు. అలాగే, సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం దత్తుచౌదరి ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ ప్రయోగాలు ఏర్పాటు చేసి వివరించారు. కార్యక్రమంలో మాతాజీలు, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదేవిధంగా, పేట మండలం జాజాపూర్, కోటకొండ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సీవీ రామన్ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన రంగోలి, సైన్స్ పరికరాల విశ్లేషణను వివరించారు. జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాశ్, హెచ్ఎంలు భారతి, సునీత, ఉపాధ్యాయులు విజయ, మధుసూదన్, లక్ష్మణ్, ప్రతాప్, నరసింహా, శశిరేఖ, నిర్మల, మంగళ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మక్తల్‌లోని డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు తమ తమ ఆవిష్కరణల గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ నారాయణగౌడ్, అధ్యాపకులు హరిశ్చంద్ర, రమేష్‌గౌడ్, నర్సోజీ, లింగప్ప, బాల్‌రాజ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, జహంగీర్, మహేష్, సులోచన, రాజేశ్వరి, నాగేంద్రమ్మ, ప్రదీప్‌కుమార్‌లు పాల్గొన్నారు. అలాగే, పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. సమావేశానికి ఎంఈవో అనిల్‌గౌడ్ హాజరై విద్యార్థుల ప్రదర్శనలు తిలకించి మాట్లాడారు.

దామరగిద్దలోని జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులు విద్యార్థులకు సైన్స్ పటాలకు సంబంధించిన డ్రాయింగ్ పోటీలు, క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో భాగంగా సైన్స్ పరికరాలను ప్రదర్శించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్ఎం అశోక్, సైన్స్ ఉపాధ్యాయులు శంబులింగం, శ్రీనివాస్‌రెడ్డి, నిర్మల, అమృత్, సక్సేనా, తిప్పన్న, మల్లికార్జున్ పాల్గొన్నారు.

కృష్ణ మండలం ముడుమాల్ గ్రామ జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన సైన్స్ దినోత్సవంలో ఎంఈవో నిజాముద్దీన్ మాట్లాడారు. అంతకు ముందు విద్యార్థులు చేపట్టిన వివిధ రకాల సైన్స్ ప్రదర్శన, ప్రయోగాలు, రాకెట్ తయారీ విధానాలను ఎంఈవో పరిశీలించారు. సైన్స్‌పై ఉపాధ్యాయులు క్విజ్ నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. జీహెచ్ఎం జనార్దన్‌రెడ్డి, కుర్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోస్గి మండలం ముశ్రీఫా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. సైన్స్‌కు సంబంధించిన ప్రయోగాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఆధునిక యుగంలో శాస్త్ర సాంకేతిక రంగం ప్రాముఖ్యతను హెచ్ఎం శేఖరయ్య విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు బాలకృష్ణ, శకుంతల, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూర్ మండలం బిజ్వార్‌లో పాఠశాలలో సీవీ రామన్ అక్షరాల ఆకారంలో విద్యార్థులు కూర్చొని ఆయనకు నివాళి అర్పించారు. అలాగే ఊట్కూర్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాల, కొల్లూర్, పెద్దజట్రం, చిన్నపొర్ల పులిమామిడి పాఠశాలల్లో సైన్స్ దినోత్సవం నిర్వహించారు.

మక్తల్ మండలం రుద్రసముద్రం గ్రామ ఎంపీయూపీఎస్‌లో విద్యార్థులు సైన్స్‌డేను జరుపుకున్నారు. హెచ్ఎం హేమలతఅన్వార్ మాట్లాడారు. సీవీ రామన్ ఎఫెక్ట్ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమార్, ప్రహ్లాద్, ఎం.ఆంజనేయులు, ఎన్.మంజులత, టి.ప్రమీల, రామ్‌కిరణ్, వరుణ్‌కుమార్, దివ్యజ్యోతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దామరగిద్ద జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన సైన్స్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



కోస్గి మండలం ముశ్రీఫా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు

▸ కాంగ్రెస్ పార్టీ పేట నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి



పదవీ విరమణ పొందిన ఎస్ఈ సంజీవరెడ్డిని సత్కరించిన కుంభం శివకుమార్‌రెడ్డి

నారాయణపేట న్యూటౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని, విధుల్లో ఉన్నన్ని రోజులు ప్రజలకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలని కాంగ్రెస్ పార్టీ పేట నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీగార్డెన్‌లో ట్రాన్స్‌కో ఎస్ఈ సంజీవరెడ్డి పదవీ విరమణ సభకు కుంభం శివకుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డిని శాలువాతో సత్కరించి, మాట్లాడారు. మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ హరినారాయణభట్టడ్, మాజీ కౌన్సిలర్లు సలీం, మారుతీ, గందె చంద్రకాంత్, మాజీ ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ కృష్ణ, అశోక్, రాజు, మాజీ కౌన్సిలర్ బోయ నాగేందర్‌తో పాటు ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు. అలాగే, నారాయణపేట ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్ పాపిరెడ్డి పదవీ విరమణ పొందడంతో స్థానిక డిపోలో డీఎం లావణ్య శాలువా, జ్ఞాపికతో సన్మానించి, మాట్లాడారు. కార్యక్రమంలో సీఐ అలివేలమ్మ, నరేందర్, శ్రీశైలమ్మ, హన్మంతు, ఆంజనేయులు, సురేష్, చాంద్‌పాషా, నర్సింలు తదితరులున్నారు. పేట మండలం కోటకొండ పీహెచ్‌సీలో పీహెచ్ఎన్ సునంద పదవీ విరమణ కార్యక్రమానికి డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మితో పాటు, మెడికల్ అధికారి ప్రతిభ, శిరీష, అశోక్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



మక్తల్ మండలం జక్లేర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులైన విద్యార్థులు

మక్తల్ రూరల్/మక్తల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలం జక్లేర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం బదిలీ, పదోన్నతుల ద్వారా వెళ్లిన ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి సన్మానం చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం ఎస్.చంద్రకళ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సిములు, ఉపాధ్యాయులు లక్ష్మణ్, శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

అదేవిధంగా, మక్తల్ పట్టణంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో విద్యార్థులు శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. కలెక్టర్‌గా జుట్ల నందిని, హెచ్ఎంగా స్పందనతో పాటు పది మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతిభ కనబర్చిన వారికి యూనియన్ బ్యాంకు అధికారి స్వాతిరాజేష్‌జోషి పరీక్ష ప్యాడ్‌లు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు మన్నాని వెంకటేష్, రఘుప్రసన్నభట్, కావలి వెంకటేష్, కొండ విజయ్‌కుమార్, పాఠశాల ప్రధానాచార్యుడు కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.



సరస్వతీ శిశుమందిర్‌లో స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకుంటున్న విద్యార్థులు

పిల్లలకు ఉత్తమ విద్యాబోధన చేయాలి

▸ కలెక్టర్ సిక్తా పట్నాయక్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేటటౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉత్తమ విద్యాబోధన చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నారాయణపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సింగార్‌బేస్, భవిత కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధన ఏవిధంగా జరుగుతుందో పరిశీలించారు. భవిత కేంద్రంలో జరిగే కార్యక్రమాలు, ఫిజియోథెరపీ, హోమ్ బేసిక్ ఎడ్యుకేషన్ గురించి సంబంధిత ఐఈఆర్పీ, ఎంఈవోలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ కోఆర్డినేటర్ రాజేంద్రకుమార్, యాదయ్యశెట్టి, శ్రీనివాస్, సెక్టోరియల్ అధికారి, ఎంఈవో బాలాజీ, శ్రీనివాస్, విజయలక్ష్మి తదితరులున్నారు.

అంటరానితనం, అసమానతలను నిర్మూలించాలి

▸ ఆర్ఐ శ్రీశైలం ▸ నేరడగమ్ములో పౌర హక్కులపై అవగాహన



పౌర హక్కులపై అవగాహన కల్పిస్తున్న పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు

మాగనూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని అంటరానితనం, అసమానతలను నిర్మూలించాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం కోరారు. ప్రస్తుతం ఇవి అంతగా లేనప్పటికి అక్కడక్కడా గ్రామాల్లో ఉన్న అసమానతలను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఇందుకోసం కృషి చేయాలని సూచించారు. శుక్రవారం మండలంలోని నేరడగమ్ము గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రజలకు పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్ఐ శ్రీశైలం, కానిస్టేబుల్ కృష్ణప్రసాద్‌లు మాట్లాడారు. కులం పేరుతో ఎవరైనా దూషిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, అంటరానితనం నేరమన్నారు. కులమతాలతో తేడా లేకుండా అందరు కలిసిమెలిసి ఐకమత్యంగా ఉండాలని, గ్రామాభివృద్ధికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈనెల 3న కంటి వైద్య శిబిరం

మక్తల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణంలోని లయన్స్‌క్లబ్ భవనం వద్ద ఈనెల 3న కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నామని క్లబ్ అధ్యక్షుడు డీవీ.చారి తెలిపారు. 50 ఏళ్లు పైబడిన వారు తమ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఓటర్ ఐడీ కార్డుల జిరాక్సు ప్రతులతో శిబిరానికి హాజరు కావాలన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్నవారికి మహబూబ్‌నగర్‌లోని ఎనుగొండ రాంరెడ్డి కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పేటలో పీజీ, ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేయాలి

నారాయణపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేసి నారాయణపేటలో పీజీ, ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు నరహరి డిమాండ్ చేశారు. స్థానిక స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో జరిగిన మూడవ ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు 11 మంది సభ్యులతో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా భానుప్రసాద్, పవన్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నయామ్, రమేష్, అనిల్, శ్రావణ్, హన్మంతు, సంతోష్ తదితరులున్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

ఊట్కూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరు ఆన్‌లైన్ దోపిడీ చేసే సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని సీఎఫ్ఎల్ కౌన్సెలర్ ఎస్‌కే.చాంద్‌సుల్తానా అన్నారు. శుక్రవారం ఊట్కూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వీఏడీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక నేరగాళ్లు పెరగడంతో మొబైల్‌కు వచ్చే ఓటీపీలు, ఏటీఎం నెంబర్లు ఎవరికి చెప్పొద్దని అన్నారు. అలాగే ప్రభుత్వం తీసుకొచ్చిన బీమా పథకాలు, అకౌంట్ లావాదేవీలతో పాటు సుకన్య సమృద్ధి పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోషి పాల్గొన్నారు.

అన్నదానానికి మించిన దానం మరొకటి లేదు

నారాయణపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అన్నదానానికి మించిన దానం మరొకటి లేదని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు అన్నారు. శుక్రవారం నారాయణపేట యాద్గీర్ రోడ్‌లోని అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం జరిగిన అన్నదానం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో సుధీర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, సైదప్ప, మిర్చి వెంకటయ్య, సూరి, రవి, బాల్‌రాజ్ మహిళలు పాల్గొన్నారు.

బసవేశ్వర దేవాలయంలో పూజలు

జిల్లా సరిహద్దులోని కళబేళగుంది బసవేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం అమావాస్య ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తర నియమావళి, అలంకరణ, మహా మంగళహారతి అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

కోస్గి రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ముశ్రీఫా గ్రామానికి చెందిన చాకలి కిష్టమ్మ(38) గతనెల 17వ తేదీ నుంచి కన్పించడం లేదని ఆమె భర్త వీరప్ప పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోస్గి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం మండల పరిధిలోని గుండుమాల్ వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో గుండుమాల్ సమీపంలోని తిరుమల గుట్ట దగ్గర పోలీసులు వెంబడించి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ట్రాక్టర్ యజమాని వెంకటయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు.

ప్రమాదాలకు నిలయంగా కూలీల అడ్డా

▸ ఓ వైపు రోడ్డు విస్తరణ.. మరోవైపు జనసంద్రంగా కూలీలు

▸ వాహనదారులకు తీవ్ర అంతరాయం ▸ పట్టించుకోని పోలీసులు



ప్రధాన రహదారిపై నిలబడిన అడ్డా కూలీలు

కోస్గి ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కూలీల అడ్డా ప్రమాదాలకు నిలయంగా మారింది. కోస్గి పట్టణంలోని శివాజీ కూడలిలో ప్రతీనిత్యం అడ్డా కూలీలు పని కోసం నిలిచి ఉంటారు. ఓ మేస్త్రీ లేకపోతే పనిమనిషి కావాలని ఏ వ్యక్తి వచ్చినా అతడి చుట్టూ వారంతా గుమిగూడతారు. నారాయణపేట కోస్గి, దౌల్తాబాద్, తాండూర్ మహబూబ్‌నగర్, పరిగి నుంచి వచ్చే వాహనాలన్నీ ఈ కూడలి వద్ద కలుస్తాయి. దీంతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రస్తుతం ఈ కూడలి వద్ద చించోలి-భూత్పూర్ హైవే పనులు సాగుతున్నాయి. ఇక్కడే నిత్యం కూలీలు ఉండటంతో వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. దీంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదు. వారంరోజుల క్రితం ఈ కూడలిలోనే ద్విచక్ర వాహనం, కారు ఢీకొని ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఇక ఆదివారం కోస్గి వారాంతపు సంత కావడంతో ఈ రోడ్డుపై పండ్ల వ్యాపారులు తమ తోపుడుబండ్లను నిలిపి రహదారిని మరింత ఆక్రమించేస్తున్నారు. ప్రధాన రహదారిపై బండ్లను పెట్టవద్దని ఎవరైనా ప్రశ్నిస్తే తాము మునిసిపాలిటీకి తైబజార్ రుసుము కడుతున్నామని, తమను ఎవరూ ఏమీ చేయలేరని దబాయిస్తున్నారు. ఇప్పటికైనా మునిసిపల్, పోలీసు అధికారులు స్పందించి కూలీల అడ్డాను వేరేచోటకు మార్చాలని, రహదారిపై ప్రమాదాలు జరగకుండా నియంత్రించి ప్రజల ప్రాణాలు కాపాడాలని పలువురు కోరుతున్నారు.